
# కాపాడే దేవతలు



"ఈ రాకాసుల్తో నేనేగలేను. నీ పిల్లల్ని నువ్వేం జేసుకుంటావో చేసుకో !" ఇంట్లో అడుగు పెడుతున్న కామేశ్వరరావుకు 'ఉరుము మంగళా'న్ని గుర్తు చేసింది వాళ్ళావిడ అనసూయ.

ఒక్క క్షణం పరిస్థితినాలోచిస్తూ, వాతావరణాన్ని అవలోకించాడు.

ఆరేళ్ల పెద్దమ్మాయి గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ మంచంమూలన కూర్చుంది. నాలుగేళ్ల చిన్నది ఆరున్నొక్క రాగంలో నిమగ్నమై ఉంది. ఏదో 'వరిగింజా - బియ్యం గింజా' అనుకుంటూ షర్టు విప్పి, "లుంగీ !" అన్నట్లు చెయ్యి సాచాడు భార్యవంక, యథాలాపంగా.

"హుఁ !" అంటూ విసురుగా వంటింట్లోకి వెళ్లిపోయింది అనసూయ. అలా వెళ్తున్నప్పుడు ఆమె కళ్లు నీళ్లు చిప్పిల్లి ఉన్నాయనే విషయం గమనించాడు కామేశం.

సీను తనూహించినదానికంటే గంభీరంగా ఉందన్న సంగతి అర్థమైపోయింది. ఆ పరిస్థితుల్లో మౌనం వినా గొప్ప మార్గం లేదనుకున్నాడు.

ముందుగా చిన్నమ్మాయి సాహితిని ఎత్తుకున్నాడు. తండ్రి ఆప్యాయతా స్పర్శతో దాని ఆవేదన శ్రుతి పెరిగింది. ముక్తాయికి ముందు గమకంలా?

"ఒంటే, నాన్నా ! ఒలేమన్నారే చిట్టితల్లి ?" లాలనగా, ముద్దుగా అడిగాడు.

"అమ్మ కొట్టింది !" అంత ఏడుపులోనూ ఆక్రోశంగా, కోపంగా కుండ బద్దలు కొట్టింది చిన్నది. అంతసేపూ ఆలపించిన 'శివరంజని' మంద్రమైంది.

నీ పిల్లలకో నమస్కారం ! దయచేసి నా దారిన నన్ను పోనీయ్ !" క్షణక్షణానికీ పెరుగుతున్న కోపం, ఆవేశం విచక్షణా శైత్యాన్ని దగ్గరికే రానీయకుండా మరిగిపోతున్నాయి. చివరి మాటలంటున్నప్పుడు కన్నీళ్లు వరదలయ్యాయి. అధరాలు చిగురుటాకు లయ్యాయి.

కామేశం మొహాన్ని ప్రశ్నార్థకం అలుముకుంది.

అపాటికే పక్క పోర్షను చెవులు గోడలకతుక్కుపోయాయని గ్రహించి నట్లున్నాడు కామేశం. కోపాన్నణుచుకునే ప్రయత్నం చేస్తూ, "ఇంతకూ ఇప్పుడేమంటావ్ ?"

"ఏంటీ అనేది ? చెవుడా ? నే వెళ్తున్నాను. ఇహ నాకు, ఈ కుటుంబానికీ ఏ సమ్మంధవూ లేదు !" జిర్రున చీదేసింది నిర్దాక్షిణ్యంగా.

అప్పటికే అక్కడికి చేరిన సాహితీ, సౌజన్యలు బిక్కుబిక్కుమంటూ తల్లిదండ్రుల్ని మార్చి మార్చి చూస్తున్నారు.

ఇవేమి గమనించనట్టే సూట్‌కేస్ అందుకుని గుమ్మంవేపు అడుగులేసింది అనసూయ.

హఠాత్తుగా ఎదురైన ఇరుగింటి పద్మజను చూసి 'అపశకునం' ఎదురైనట్లు ఆగిపోయింది.

అదే అదనుగా కామేశం పిల్లలిద్దర్నీ తీసుకుని పొరుగింట్లో వదిలేసేందుకు వెళ్లాడు.

"అదేంటొదినా, సంసారమన్నాక ఎన్నో అనుకుంటాం. మరీ ఇంత మాట పట్టింపైతే ఎలా ?" 'కడుపు-కాళ్లు' సామెత గుర్తు చేస్తున్నట్లుంది పద్మజ. జరిగిన సంఘటనను ఊహిస్తూ, తనకున్న తెలివిని జోడించింది.

"నీకు తెలీదొదినా ! ఏడేళ్లుగా ఇదే వరస ! నాలో భరించే ఓపిక పూర్తిగా నశించింది. నేను చచ్చేదాకా ఈ మనిషి తీరు మారదు. ఇట్లాంటి మగాళ్లందరికీ తెలిసొచ్చేలా చేస్తా ! నన్నెళ్లనీ !" ముందుకెళ్లబోయింది.

"ఇంతకూ అన్నయ్యగారేమన్నారేమిటీ ?" పద్మజ ఆరా. అదే ప్రయత్నంలో ప్రశ్న ఎర.

"ఆ మహానుభావుడేమీ అననఖ్ఖర్లా ! ఆ జిడ్డు మొహం చూస్తూంటేనే నా కసహ్యం ! ప్రపంచంలో ఈయనొక్కడే దేశోద్ధరణ చేస్తున్న పోజులు జూస్తే ఒళ్లంతా కంపరం పుడుతుంది !

"ఏడేళ్లలో ఏ పూటైనా ఇంటిపట్టునున్న పాపానపోయాడా ? ఎప్పుడూ అర్ధరాత్రి సత్రమే ! క్షణం తీరిక లేదు, దమ్మిడీ ఆదాయం లేదు. ఇల్లెందుకతగాడికి దేశసేవకే తీరిక లేదు. ఇంటికెప్పుడైనా రావచ్చు, వెళ్లొచ్చు మరి ! తేలిగ్గా వచ్చిన పెళ్లాం, తేరగా దొరికే జీతం !"

జీతం – జీవితం ఈక్వేషను మధ్యతరగతికి నల్లబల్లమీద కనబడగానే కాసేపు వర్తమానాన్ని మరచిపోయింది అనసూయ.

"ఇన్నేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాను. తోటివాళ్లు మొగుళ్లకు డబ్బులీయకుండా దాచుకుని చీరెలూ, వస్తువులు, నగలూ, సౌకర్యాలూ అమర్చుకుంటున్నారు. ఎంత సంపాదిస్తే ఏం లాభం ? ఏట్లో పచ్చిపులుసే ! ఓ సినిమా లేదు, షికారు...." దుఃఖం కొద్దిక్షణాలు రాజ్యం చేసింది. కళ్లు తుడుచుకుంటూ మళ్లీ అందుకుంది.

"ఎన్నడైనా సరదాగా ఓ సినిమాకెళ్లిన దౌర్భాగ్యం లేదు. తప్పనిసరై షాపింగ్‌కెళ్దామంటే, ఇంట్లో ఈ రాకాసులు– తాటకీ – శూర్పణఖ ! అయ్యను మించిన బిడ్డలు. ఒక్కతైనా చెప్పినట్టింటుందా ? ఇంట్లో ఉండమంటే ఏడుపు. బజారుకెళ్తే అది కావాలీ, ఇది కావలంటూ సాధింపు – వీథిలోనే పరువు తీస్తారు!

"అందరు మొగుళ్లు ఇట్లాగే ఉన్నారా ? నువ్వు చెప్పు, పద్మా !" నిలదీసినట్టే అడిగింది.

'నా మొగుడు నీ మొగుడికంటే ఎంతనయం ? నేనే బాధపడ్తున్నా ననుకున్నా ! నేను రోలైతే, నువ్వు మద్దెలగదే, తల్లీ !' అని మనసులోనే సంబరపడింది పద్మజ. పైకి మాత్రం –

"ఔనొదినా ! నీ పిల్లలు మాత్రం మా చెడ్డ అల్లరోళ్లు !" 'కాలే పెనంమీద నీటిబొట్టు' విదిల్చింది.

"ఎవరేమన్నా సరే ! నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. అసలిన్నాళ్లూ ఎలా భరించానో తల్చుకుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది. వెళ్తానొదినా! నీకు దండం పెడతా! నన్నాపే ప్రయత్నం చెయ్యకు !"

అంతసేపు బయట నిలబడి అన్నీ వింటున్న కామేశ్వరరావు హఠాత్తుగా గుమ్మంలోకొచ్చి అడ్డంగా నిలబడ్డాడు.

"ఆగు !" అంతసేపు తమాయించుకున్న కోపం ఉప్పెనగా మారింది.

పరిస్థితి శ్రుతిమించిన సంగతి గమనించి, చల్లగా జారుకున్నది పద్మజ.

"ఏమి"టన్నట్లు నిర్లక్ష్యంగా భర్తవైపు చూసింది అనసూయ.

"ఇదే నీ తుది నిర్ణయమా ?" తనూ ఓ నిర్ణయానికొచ్చినట్లు ప్రతిధ్వనించింది కామేశం గొంతు.

"మాకు తుది నిర్ణయాలూ, తొలి నిర్ణయాలంటూ పదేసి ఉండవు ! పక్కకు తప్పుకో !" రెండడుగులు ముందుకేసింది.

జీతం – జీవితం ఈక్వేషను మధ్యతరగతికి నల్లబల్లమీద కనబడగానే కాసేపు వర్తమానాన్ని మరచిపోయింది అనసూయ.

"ఇన్నేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాను. తోటివాళ్లు మొగుళ్లకు డబ్బులీయకుండా దాచుకుని చీరెలూ, వస్తువులు, నగలూ, సౌకర్యాలూ అమర్చుకుంటున్నారు. ఎంత సంపాదిస్తే ఏం లాభం ? ఏట్లో పచ్చిపులుసే ! ఓ సినిమా లేదు, షికారు...." దుఃఖం కొద్దిక్షణాలు రాజ్యం చేసింది. కళ్లు తుడుచుకుంటూ మళ్లీ అందుకుంది.

"ఎన్నడైనా సరదాగా ఓ సినిమాకెళ్లిన దౌర్భాగ్యం లేదు. తప్పనిసరై షాపింగ్‌కెళ్దామంటే, ఇంట్లో ఈ రాకాసులు– తాటకీ – శూర్పణఖ ! అయ్యను మించిన బిడ్డలు. ఒక్కసారైనా చెప్పినట్టింటుందా ? ఇంట్లో ఉండమంటే ఏడుపు. బజారుకెళ్తే అది కావాలీ, ఇది కావలంటూ సాధింపు – వీధిలోనే పరువు తీస్తారు!

"అందరు మొగుళ్లూ ఇట్లాగే ఉన్నారా ? నువ్వు చెప్పు, పద్మా !" నిలదీసినట్టే అడిగింది.

'నా మొగుడు నీ మొగుడికంటే ఎంతనయం ? నేనే బాధపడ్తున్నా ననుకున్నా ! నేను రోలైతే, నువ్వు మద్దెలగదే, తల్లీ !' అని మనసులోనే సంబరపడింది పద్మజ. పైకి మాత్రం –

"ఔనొదినా ! నీ పిల్లలు మాత్రం మా చెడ్డ అల్లరోళ్లు !" 'కాలే పెనంమీద నీటిబొట్టు' విదిల్చింది.

"ఎవరేమన్నా సరే ! నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. అసలిన్నాళ్లూ ఎలా భరించానో తల్చుకుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది. వెళ్తానొదినా! నీకు దండం పెడతా! నన్నాపే ప్రయత్నం చెయ్యకు !"

అంతసేపు బయట నిలబడి అన్నీ వింటున్న కామేశ్వరరావు హఠాత్తుగా గుమ్మంలోకొచ్చి అడ్డంగా నిలబడ్డాడు.

"ఆగు !" అంతసేపు తమాయించుకున్న కోపం ఉప్పెనగా మారింది.

పరిస్థితి శ్రుతిమించిన సంగతి గమనించి, చల్లగా జారుకున్నది పద్మజ.

"ఏమి"టన్నట్లు నిర్లక్ష్యంగా భర్తవైపు చూసింది అనసూయ.

"ఇదే నీ తుది నిర్ణయమా ?" తనూ ఓ నిర్ణయానికొచ్చినట్లు ప్రతిధ్వనించింది కామేశం గొంతు.

"మాకు తుది నిర్ణయాలూ, తొలి నిర్ణయాలంటూ పదేసి ఉండవు ! పక్కకు తప్పుకో !" రెండడుగులు ముందుకేసింది.

"ఒక్క నిమిషం ! నీ మెళ్లోని తాలిబొట్టు ఇక్కడ పెట్టేసి వెళ్లిపో !"

క్షణకాలం స్తంభించినట్లయింది.

'ఏం ? సెంటిమెంటుతో కొడ్తున్నావా ? చూడూ, నాకిలాంటి బోడి సెంటిమెంట్ల మీద నమ్మకం లేదు, ఈ క్షణాన్నే నీ మొహంమీద విసిరేసి పోగల్ను. కానీ, ఏది జరిగినా చట్టబద్దంగా జరగాలి. కోర్టునుండి డైవర్సు అందిన మరుక్షణం కాగితాల్లో పెట్టిచ్చేస్తా నీ తాళిబొట్టు !" చివరి మాటలు నొక్కి పలికింది వ్యంగ్యంగా.

ఒకింత అయోమయంలో పడిపోయాడు కామేశ్వర్రావు.

"చూడు, వెళ్లడమే నిజమైతే ఇంత యాగీ చేసి వెళ్లాలా ? రేపుదయాన్నే ప్రశాంతంగా వెళ్దువుగాని !" మెత్తబడుతున్నట్లు ఇంకేదో అనబోయాడు.

"ఏం...ఒక్క రాత్రి పక్కలో లేకపోతే గడవదా ? తేరగా వచ్చే సుఖం గదా ! నీ నక్కజిత్తులు నాకు తెలియవనుకోకు. రాత్రి ప్రయాణం, ఒంటరి ప్రయాణం నాకేమీ కష్టం కాదు ! నీ దిక్కుమాలిన సలహాలకో దండం ! నీ దయవల్ల ఈ గుండె ఎప్పుడో బండగా మారింది. చాలా థాంక్స్ !"

కామేశాన్ని తోసుకుంటూ గడప దాటింది అనసూయ.

నిస్సహాయుడయ్యాడా మానవుడు.

* * *

రాత్రి తొమ్మిదీ నలభై కావస్తోంది.

ఆమె తొందరపడిందే అనుకుందాం. మరి తానో, నలుగురితో తిరిగే వాడు, నాలుగు విషయాలూ తెలిసినవాడు, నచ్చజెప్పి ఒప్పించలేకపోయా డెందుకు ?

ఎక్కడా ? ఆ అవకాశమే ఇవ్వలేదు తనకు. ఎన్నాళ్లుగా నింపుకుందో? అడపాదడపా గొడవ పడ్తుండటమైతే ఉన్నదే. అది అన్ని సంసారాల్లోనూ ఉండేదే కదా అని అనుకున్నాడు. అయినా, ఆడదానికంత పొగరేంటి ? తను మగాడు. నాలుగు సమాజాల్తో సంబంధమున్నవాడు. లక్షా తొంభై పన్లుంటాయ్.

మందుకోసమో, మరే వ్యసనంకోసమో తను తిరగట్లేదుగా ! మొదట్నుంచీ 'ఉద్యోగం-ఇల్లు' సూత్రం కాదు తనది, అంతకుమించి ఆటలూ, పాటలూ, కవిత్వం కాకరకాయలూ, కబుర్లు షికార్లు వగైరా వగైరాలనూ, వీటివల్ల ఆవిడకేంటట నష్టం ?

తనూ ఉద్యోగం చేస్తుందన్న టెక్కు ! అయినా, ఎంతమంది ఆడాళ్లు ఉద్యోగం చేయట్లేదు ? ఆ అహంకారంతోనే కదా తనకు సంబంధించిన వాళ్లెవరైనా ఇంటికొస్తే, కనీసం మర్యాద తెలీకుండా ప్రవర్తిస్తుంది. అదే, ఆమెకు సంబంధించినవాళొస్తే ఇల్లూ వాకిలీ ఒకటైనట్లు ఒహటే హడావుడి !

ఈ సంసారమేనాడు సంతోషంగా గడిచిందని ? ఏదో ఒక అభిప్రాయంలో భేదం వస్తే సర్దుకుపోవచ్చు కానీ, ఏ అభిప్రాయమూ కలవకపోతే ఈ రథం కదిలేదెట్లా ? ఈ నిప్పూ- ఉప్పూ ఎన్నాళ్లు కలిసుంటాయి ? ఇదీ మన మంచికే జరిగిందేమో !

పిల్లలో ? కోర్టుకెళ్తానంటుందిగా ! వాళ్లేం చెబుతారో ? అయినా తను చూసుకోలేదా ? రెండేళ్లనాడు ఆఫీసు ఇన్‌స్పెక్షనుందంటూ రెండుగంటలు ఆవిడ ఆలస్యంగా వస్తే, చిన్నదాన్ని సంభాళించుకోలేక ఎంత యమయాతన పడ్డాడు ? అయినా ఇప్పుడు కాస్త పెద్దవాళ్లయ్యారు కదా ! చెప్పినట్టే వింటారు.

ఉద్యోగం చేస్తూ పిల్లల్ని చూసుకోవడం..... ఎందుకో కామేశం ఆలోచనలక్కడాగి పోయాయి ఠక్కున.

పెద్దమ్మాయి సౌజన్య నిద్రపట్టక అంతసేపూ అటూ ఇటూ కదిలి, మెల్లగా దుప్పట్లోనుండి తల బయటపెట్టింది.

“నాన్న! అమ్మ మళ్లీ రాదా ?” అలా అంటున్నప్పుడు దాని గొంతు జీరవోయింది.

కామేశానికి గుండెలో ముల్లు గుచ్చుకున్నట్లయింది. సాహితివైపు చూశాడు. నిద్రపోతుంది. పరిపూర్ణమైన అమాయకత్వం దాని అణువణువూ ప్రతిబింబిస్తోంది.

‘పోనీ, పిచ్చిది ! నాన్న చెప్పినట్టినదు కదా !” అని ముద్దు ముద్దుగా అంటున్నట్టనిపించింది.

కళ్లలో నీళ్లు నిండాయి. వంగి, బుగ్గన ముద్దెట్టుకున్నాడు ఆర్ద్రంగా.

❄ ❄ ❄

ఇన్నాళ్లకు తనకు గొప్ప రిలాక్సింగ్‌గా ఉంది. వెధవ సంత ! పోనీ ! ఆడదంటే మెషిననకుంటారు వెధవలు ! వంట చేయాలి, పక్కలేయాలి, సుఖాలీయాలి, పిల్లల్ని కనాలి, పైగా ఉద్యోగం జేసి సంపాయించి పెట్టాలి.

ఛ ! ఇదే విదేశాల్లో అయితే మగాళ్లనే తన్ని తగలేస్తారు. అందుకే ఈ దేశమట్లా, దరిద్రగొట్టులా తయారైంది ! పైగా ‘యత్ర నార్యస్తు పూజ్యంతే....’ అంటూ శ్లోకాలు వల్లిస్తారు.

పూచికపుల్ల పక్కన పెట్టేందుకు చేతకాదు, పైగా ప్రపంచమంతా తమతోనే నడుస్తున్నట్టు పోజులు !

ఛ ! ఛ ! ఇన్నాళ్లూ ఎలా భరించానో, నాకే నమ్మశక్యంగాకుండా ఉంది. ఇంట్లో క్షణం తీరికలేకుండా నడ్డి విరగ్గొట్టుకోవాలి. పిల్లల చాకిరీ చేయాలి. ఆఫీసులో తలెత్తకుండా చావాలి ! మళ్లీ బంధువులు, రాబందులంటూ ఇంట్లో తయారు ! అసలు ఆడదంటే మనిషనే ఊహే లేదు. పోనీ తనవాళ్లెవరైనా వస్తే మొహంలో ఆనందం కనబడకూడదు. వాడి సొమ్మేదో దొంగలు దోచుకుపోయినట్లు మొహం.

యాక్ ! ఆ మొహం చూస్తేనే వాంతికొస్తుంది. పైగా ఉత్తముడనే ముద్రొహటి ! ఏ అలవాట్లూ లేకపోయినంతమాత్రన ఉత్తములా ? ఇంట్లో పెళ్లాం కష్టంసుఖం చూడలేని దరిద్రులు !

ఏదో కాలక్షేపం చేద్దాం కొన్నాళ్లంటే, పిల్లలో పిల్లలంటూ పోరెట్టి తల్లిని చేశాడు. నా వయస్సువాళ్లకింకా పెళ్లిళ్లే కాలేదు. నాకిద్దరు జంజాటాలు ! ఎక్కడికెళ్దామన్నా కాళ్లల్లో అడ్డుపుల్లలు. ఆ రకంగా కూడా స్వేచ్ఛలేకుండా చేశాడు మహానుభావుడు !

ఇప్పుడనుభవించనీ తెలుస్తుంది. పిల్లలతో వేగడం ఎలా ఉంటుందో....

ఉలిక్కిపడింది అనసూయ.

బస్‌స్టేషన్‌లో గోడ గడియారం మ్యూజిక్ విని, రిస్టు చూసుకుంది, రాత్రి పదయ్యింది.

కంట్రోలర్ రూమ్ వద్ద ఎంక్వయిరీలో అడిగింది. "నైన్ ట్వంటీకి లాస్ట్ బస్ అన్నారు కదండీ ! ఇంకా రాలేదేం ?" ఎంత దాచుకున్న కంగారు దాగలేదు అనసూయ గొంతులో.

"ఏమోనండీ ! ఈపాటికే రావాలి. బస్సు సంగతి ఎలా చెప్పడానికొస్తుంది. మధ్యలో ఎక్కడైనా.....అయినా ఒంటరిగా ఉన్నట్టున్నారు, ఇంత రాత్రివేళ..."

ఆపై కంట్రోలర్ చెప్పే మాటలు వినలేకపోయింది అనసూయ, విసవిసా తన స్థానానికి వచ్చి మళ్లీ కూర్చున్నది. 'హూం ! ప్రతి వెధవా సలహాలిచ్చేవాడే!' అనుకున్నది.

మరుక్షణమే 'నిజంగా బస్ ఫెయిలైతే....? అపై ఆలోచించలేకపోయింది.

చుట్టూ చూసింది.
దాదపు నిర్మానుష్యంగా అనిపిస్తోంది బస్‌స్టేషన్.

నాలుగో నంబరు ప్లాట్‌ఫారం వద్ద ఇద్దరు ముసలాళ్లు చుట్ట తాగుతూ, మధ్యమధ్యలో దగ్గుతున్నారు. మాటలు మాత్రం వినిపించట్లేదు. వాళ్లకు కొద్దిదూరంలో ఓ శాల్తీ ముడుచుకుని

పడుకుని ఉంది. ఆడో, మగో గుర్తించడం కష్టం.

తనకు కొద్దిదూరంలో సిమెంటు స్తంభానికి కాస్త చాటుగా ఎవరో ఇద్దరు రౌడీ వెధవల్లా ఉన్నారు. ఏవో పకపకలూ, ఇకఇకలూ, కొంచం రిక్కించి వింటే తన గురించే అవాకులు పేల్తున్నట్లు తెలుస్తుంది.

చురుక్కున చూసింది.

ఆ క్షణంకోసమే ఎదురు చూస్తునట్లు అందులో ఒహడు వెకిలిగా కన్నుగీటాడు.

'చెప్పుచ్చుక్కొడ్తా, వెధవా !' అని మనసులోనే అనుకుని, పళ్లు నూరుకుంది.

క్షణాలు దొర్లుతుంటే ఏదో దిగులు మెల్లమెల్లగా అనసూయ మనసును ఆవరించుకోసాగింది.

దూరాన హోమ్‌గార్డులా కనిపించాడో మనిషి, వెళ్లి చెప్పాలనుకుంది. 'ఆఁ, మరికాస్సేపట్లో బస్సొచ్చేస్తుంది. ఎందుకనవసరంగా గొడవ ?' తనకు తానే సర్దిచెప్పుకుంది.

సడెన్‌గా కరెంటు పోయింది.

మొట్టమొదటిసారిగా ఒళ్లు జలదరించింది అనసూయకు. భయం గుప్పెట్లో గుండె కొట్టుకోసాగింది. అసలే శుక్లపక్షం ప్రథమార్థం. కన్ను మూసినా, తెరచినా ఒకటిగానే ఉంది.

కంట్రోల్ రూమ్‌లో అగ్గిపెట్టెకోసం తడుముతున్న అలికిడి వినిపిస్తోంది. క్షణాలు లెక్కపెట్టుకోసాగింది ఆమె.

సరిగ్గా అప్పుడే అనాచ్ఛాదితంగా ఉన్న అనసూయ నడుంపై ఓ చేయి పడింది.

పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది.

"కెవ్వు" మని అరిచింది భయంతో.

దాదాపు అలాంటి అరుపే ప్రతిధ్వనించింది పక్కనే. ఆపై బిగ్గరగా ఏడుపు.

మరుక్షణం అయోమయం నుండి తేరుకుంది. ఆ శబ్దం తనకు తెలిసిందే. చిట్టితల్లి సౌజన్యది.

"కన్నా ! సౌజీ !" అంది గాద్గదికంగా.

"అమ్మా !" అంటూ మళ్లీ బిగ్గరగా ఏడ్వసాగింది సౌజన్య.

"నా తల్లే !" గట్టిగా గుండెలకు హత్తుకుని బుగ్గన ముద్దెట్టుకుంది.

లైట్లు వెలిగాయి.

ఎదురుగా కామేశ్వర్రావు కనిపించాడు చంటిదాన్నెత్తుకుని.

అక్కనూ, తల్లినీ చూసి తండ్రి చంక దిగి నాలుగడుగులు ముందుకేసి, తల్లిఎదురుగా వచ్చి నిలబడింది బుంగమూతితో సాహితి.

"సాహీ !" అంటూ ఆప్యాయంగా చేతులు సాచింది తల్లి "నేను మాట్లాడను, పో ! నీ దోస్త్ కటీఫ్ !" సాహితి బింకం తగ్గలేదు.


"నేను సారీ చెబుతానే నాన్నా !" అంటూ గొంతుక్కూచుని లాలనగా దగ్గరకు తీసుకుంది అనసూయ.

తల్లి మెడచుట్టూ చేతులు వేసి బుగ్గన ముద్దెట్టుకుంది సాహితి – 'క్షమించేశాను, పో !" అన్నట్లు.

కన్నీళ్లాగలేదు అనసూయకు.

తల పక్కకు తిప్పుకుని కళ్లు తుడుచుకున్నాడు కామేశం.

సంసారాలు విచ్ఛిన్నం కాకుండా కాపాడుతున్న 'చిన్నారి దేవుళ్లని' తలుచుకుంటూ సూట్‌కేస్ తీసుకున్నాడు కామేశ్వర్రావు.



**(16 నవంబరు 1998, ఆంధ్రప్రభ సచిత్ర మాస పత్రిక)**